

అసమగ్ర కొలువులు

క్రమబద్ధీకరణకు నోచుకోని సమగ్ర శిక్ష ఉద్యోగులు

విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు ఆశా, నిరాశలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరణకు నోచుకోవడం లేదని, శ్రమకు తగ్గ వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సమ్మె చేసినా పరిష్కారం కాని సమస్యలు
- చాలీచాలని వేతనాలతో కుటుంబాల పోషణకు అవస్థలు
- ప్రభుత్వంపై నమ్మకంతో ఆశగా ఎదురుచూపులు



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఫైల్)

బెజ్జూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మాత్రం మారడం లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం టైం స్కేల్ ఇస్తామని ప్రకటించి క్షీరాభిషేకాలు చేయించుకుని మోసం చేసిందని చెబుతున్నారు. అలాగే అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ కూడా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం గత డిసెంబరు 6 నుంచి జనవరి 7 వరకు సమ్మె కొనసాగించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో అమలు కావడంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం బియ్యం సరఫరా, ఉపాధ్యా యుల హాజరు నమోదు, ఆన్‌లైన్ లో విద్యార్థుల నమోదు, బడీఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం వంటి పనులను నిర్వహిస్తు న్నారు. గురుకులాల్లో సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు బోధన విధులు నిర్వహిస్తుండగా బోధనేతర సిబ్బంది తమకు కేటాయించిన విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రత్యేకాధికారులు కేజీబీవీల నిర్వాహణ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. అకౌంటెంట్లు, ఏఎస్ఎంలు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, మండల స్థాయిలో సీఆర్పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, వ్యాయమ ఒకేషనల్ ఉపాధ్యాయులు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, డే, నైట్ వాచ్‌మెన్‌లు, స్వీపర్లు, స్కావేం జర్లు, జిల్లా స్థాయిలో ఏపీవోలు, సిస్టం ఎనలిస్టులు, టెక్నికల్ పర్సన్‌లు, డీఎల్ఎంటీ మెస్సేంజర్లు, మోడల్ స్కూళ్లలో పని చేసే వార్డెన్‌లు, ఆపరేటర్లు, కేర్ టేకర్లు కూడా సమగ్ర శిక్ష పరిధిలోకే వస్తారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఫైల్)

● జిల్లా వ్యాప్తంగా 440 మంది..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 440 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉన్నా రు. కేజీబీవీల్లో 347 మంది, సీఆర్పీలు 54, సీసీవోలు 10 మంది, ఎంఐఎస్‌సీవోలు 11, ఐఈఆర్పీలు 18 మంది పని చేస్తు న్నారు. కలెక్టర్ రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపిం చే యూడేస్, మధ్యాహ్న భోజన పథకం నివేదికల తయారీలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కీలక పాత్ర. బియ్యం పంపిణీ, పాఠశాల బయట ఉన్న విద్యార్థులను గుర్తించడం వంటి పనులు ఈ ఉద్యోగులే నిర్వహి స్తుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రాఫ్ట్, ఆర్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ బోధించే ప్రత్యేక ఉపాధ్యాయులు కూడా ఎస్ఎస్ పరిధిలోకి వస్తారు.

● సమ్మె విరమణ సమయంలో..

సమ్మె విరమణ సమయంలో పే స్కేల్ అమలుపై మూడు నెలల్లో మంత్రివర్గ ఉప సంఘ సమావేశం ఏర్పాటు చేస్తామని, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి వీలుగా ఉత్తర్వులు జారీ చేస్తామని, సమ్మె కాలపు వేతనం అందజేస్తామన్నారు. కానీ ఇచ్చిన హామీల్లో ఇంత వరకు ఒక్కటి కూడా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. తమ హక్కుల సాధన కోసం 15 ఏళ్లుగా వివిధ సందర్భాల్లో పోరాటాలు చేస్తూనే వచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా తమ సమస్యలను పట్టించువడం లేదని వాపోతున్నారు.

● కుటుంబాల పోషణకు..

పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా వేతనాలు లేక పోవడంతో కుటుంబాల పోషణకు అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహి స్తున్న వచ్చే వేతనాలతో కనీస అవసరాలు తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్టు టైం ఉద్యోగులను ఫుల్ టైం ఉద్యోగులుగా గుర్తించి వేతనం పెంచాలని రెగ్యులర్ ఉద్యోగులుగా మారిదిగానే సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. 61 ఏళ్లు నిండిన ఉద్యోగులకు రూ.20 లక్షల రిటర్‌మెంట్ బెనిఫిట్ చెల్లించాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి ఉద్యోగికి రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని వారు కోరుతున్నారు.

హామీలు నిలబెట్టుకోవాలి..

- శృతిక, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు



సమ్మె సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నిలబె ట్టుకోవాలి. సమగ్ర శిక్షను పూర్తిస్థాయిలో విద్యాశాఖలో విలీనం చేసి ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలి. పేస్కేల్ అమలు కోసం మంత్రివర్గ ఉప సంఘం సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం ప్రకటించాలి. సమ్మె కాలపు వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ముగిసిన వాలీబాల్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న జైనూర్ ఎస్సై రవికుమార్

జైనూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాలలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ కాంతిలాల్ ఆటిల్ ఆదేశాల మేరకు ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ రమేశ్ పర్యవేక్షణలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో సిర్పూర్(యు) మండలంలోని కొహినూర్ జట్టు విజయం సాధించింది. జైనూర్ మండలంలోని శివనూర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు సీఐ వెలుప్పల రమేశ్, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ ఎస్సైలు రవికుమార్ రామకృష్ణ, గంగన్న, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడిమెత విశ్వనాథ్ తదితరులు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ వెల్పుల రమేశ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులతో పాటు టీ షర్టులు పంపిణీ చేశారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న రైతులు

కౌటాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పామ్ పంట సాగుపై దృష్టి సారించాలని మాట్రిక్స్ కంపెనీ సిబ్బంది సచిన్ అన్నారు. మండలంలోని గుడ్లబోరిలో రైతు అనంతుల దేవన్న ఐదు ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను ఆదివారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా మిరప, పత్తి తదితర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్‌పామ్ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. ప్రభుత్వ పరంగా 90 శాతం రాయితీపై మొక్కలను రైతులకు అందజేస్తుందన్నారు. దీంతో పాటు డ్రిప్‌పైపులను బీసీ సామాజిక వర్గం రైతులకు 90 శాం రాయితీపై, ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీపై అందజేస్తుందన్నారు. పంట నిర్వహణ ఖర్చుల కింద ఎకరానికి రూ.4,200 చొప్పున ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయం ఇస్తున్నదని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

వాంకిడి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కిషన్ రావుపేటలో చల్లూరి మల్లేష్ హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. మల్లేష్ వెల్గటూరు వెళ్లి వస్తుండగా మార్గ మధ్యలో మాటు వేసి నైనాల రాజిరెడ్డి, మల్లారెడ్డి, హరీష్‌లు విచక్షణ రహితంగా కొట్టారని అన్నారు. అనంతరం అక్కడి నుంచి కోటిలింగాల వెళ్లే రోడ్డులో కత్తులతో పొడిచి చంపేయడం దారుణమని చెప్పారు. వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోవా లని కోరారు. సమావేశంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్, సమతా సైనిక్ దళ్ జిల్లా బాధ్యులు సందీప్, దుర్గాజీ, జైరామ్, రాజేశ్వర్, శ్యాంరావు, లహుజి, సిద్ధార్థ, రమేశ్, విఠల్, వివేక్, సంగదీప్, అన్నారావు, రమేశ్, తిరుపతి, స్వాగత్, పోచాలు తదితరులు పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంఘం నాయకులు


సిర్పూర్(టి), జూలై 20 (ఆంధ్రజ్యోతి): కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకు వచ్చిన జీవో 49ను రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఇచ్చిన బంద్ పిలుపును విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాల్లో ఆదివారం తిరుగుతూ బంద్ సహకరించాలని కోరారు. అనంతరం స్థానిక విశ్రాంతి భవనం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యాపార, విద్యా సంస్థలతో పాటు అందరు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షురాలు లావణ్య, తదితరులు వారికి మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు గోపాల్, తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో జీవో 49ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. స్థానికంగా ఆదివారం అంబేద్కర్ చౌక్‌లో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆదివాసీ సంఘాల బంద్‌కు సీపీఎం పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. ఆదివాసీలకు ఇబ్బందులు కలిగించే జీవో 49ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కార్తీక్, టీకానంద్, రాజేందర్ పాల్గొన్నారు.

బంద్‌కు సంపూర్ణ మద్దతు

కాగజ్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జీవో 49ని వెంటనే రద్దు చేయాలని డిమాండు చేస్తూ సోమవారం నిర్వహించే బంద్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వెంటనే జీవో49ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పెరిగిన కోడి గుడ్డు , నాటు కోడి ధర



వాంకిడి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోడి గుడ్డు ధరలు కొండెకా క్కియి. నాటు కోడి ధరలు అందనంత దూరంగా ఉన్నాయి. చికెన్, మటన్ ఏలాగు కొనలేని నిరుపేదలు పెరిగిన ధరలతో నేడు కోడిగుడ్డు వైపు కూడా చూసే పరిస్థితి లేకుండా పోయింది. మాంస, శాఖాహారులందరూ పౌష్టికాహారంగా తీసుకునే గుడ్డు ఇప్పుడు పేదలు తినలేనంత దూరంగా పోయింది.ఇంతగా ధరలు పెరుగుతున్న గుడ్లకు మాత్రం డిమాండ్ తగ్గడం లేదు. మార్కెట్లో కోడిగుడ్డు ధర ఒక్కటికి రూ. 7కు పైనే పలుకుతుంది. గ్రామల్లో అయితే ఏకంగా రూ 8 వరకు విక్రయిస్తున్నారు. మటన్ కిలో రూ. 800,చికెన్ రూ. 260 పైనే పలుకుతోంది. ఈ ధరలతో ఎక్కవ మొత్తం గుడ్డుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. బాయిలర్ కోడి ఎంత తిన్నా.. నాటుకోడికి ఉండే రుచే వేరు. ఇక ఆసాడమాసంలో బోనాల వేళ నాటుకోడికి ఉండే డిమాండ్ అధికం. అందుకే రేటు కూడా అదే రేంజ్‌లో ఉంటుంది. అమ్మవార్లకు మొ క్కులు తీర్చుకోవడం, వన భోజనాల సీజన్‌తో గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోడి కిలో రూ. 700 చొప్పన విక్ర యిస్తున్నారు. కోడిని బట్టి ఒక్కోదానికి సుమారు రూ. 700 నుంచి వెయ్యి వరకు విక్రయిస్తున్నారు. నాటు కోడి ధరలు ఏక్కువగా ఉండడంతో ప్రజలు బాయిలర్ కోళ్లనే మొక్కులు తీర్చుకునేందుకు వినియోగిస్తున్నారు.

మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను హైదరాబాద్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవో 49ను రద్దు చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరారు. కొత్తగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలటీకి ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గురుకులాల్లో మరిన్ని సీట్లు పెంచాలని, ఐటీడీఏలను బలోపేతం చేయాలని వినతిపత్రం అందజేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను శాలువతో సన్మానించి అభినందించారు.

బోనం సమర్పించి.. మొక్కులు తీర్చుకుని..

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం భక్తులు బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కేంద్రంలో మహిళలు బోనాల పడు గ నిర్వహించారు. ఉదయం నుంచి జిల్లా కేంద్రంలోని పోచమ్మ, మైసమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భం గా కసబ్‌వాడిలోని పోచమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. భక్తులకు ఇబ్బందులు కాకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సందర్భంగా శివసత్తుల, పోతరాజుల నృత్యాలు ఆక ట్టుకున్నాయి.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పోచమ్మ ఆలయంలో భక్తులు ఉదయం నుంచి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చారు. అలాగే డాడనగర్ రాంనగర్ వద్ద పోచమ్మ ఆలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పూజలు నిర్వహించారు.శివసత్తుల నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కోనేరు రమాదేవి పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): . మండల కేంద్రంలోని కంకాలమ్మ బోనాల ప్రతి ఆషాఢ మాసం చివరి ఆదివారం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం అంగరంగ వైభవంగా కంకలమ్మ బోనాలు నిర్వహిం చారు. కన్నెపల్లి గ్రామంలో కూడా బోనాలు ఘనంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా మండల కేంద్రంలో శివసత్తులు బోనం ఎత్తుని భాజాభజంత్రీలతో నృత్యాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి బోనాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్య, మౌనీష్, తిరుపతి, శైలజ, బాపు, రవీందర్‌గౌడ్, సంతోష్, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్, పాండురంగ తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో బోనాలతో తరలివెళ్తున్న భక్తులు



కాగజ్‌నగర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కౌటాలలో బోనాలు ఎత్తుకుని వస్తున్న మహిళలు

భీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి



ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జైనూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జల్ జంగల్ జమీన్ కోసం ఆసువులు బాసిన కుంరంభీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని భీం మనుమడు కుంరం సోనేరావ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, జిల్లా సీనియర్ నాయకుడు మేస్రాం అంబా జీరావ్ ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఆదివాసీలకు మరిన్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో పులువురికి ఇందిరమ్మ గృహాలు మంజూరు కాలేదని చెప్పారు. తక్షణమే మంజూరయ్యేలా చొరవ చూపాలని కోరారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు స్పందించి గిరిజన ప్రాంతంలో మరిన్ని ఇందిరమ్మ గృహాలు త్వరలో మంజూరు కాబోతున్నాయని చెప్పారని నాయకులు అన్నారు. ఏజెన్సీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఎర్తింగ్‌తో విద్యుత్ ప్రమాదాలకు చెక్





పైప్ ఎర్తింగ్

● వర్షాకాలంలో షార్ట్‌సర్క్యూట్ జరగకుండా నివారణ

కౌటాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఇళ్లు కట్టుకుంటారు. విద్యుత్ కోసం లక్షలరూపాయలు ఖర్చుపెడతారు. కానీ విద్యుత్ ప్రమాదాలనివారణ చర్యలను ఎవరు పెద్దగా పట్టించుకోరు. తద్వారా ఏదైనా ప్రమాదం సంభవిస్తే కోట్ల రూపాయల ఆస్తితో పాటు ప్రాణ నష్టం జరుగు తుంది. అందువల్ల ఇళ్లు, షాపులు, అపార్టుమెంట్ భవనమైన నిర్మించే సందర్భంలో తగిన సామర్థ్యంతో ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. విద్యుత్ ప్రమాదాల తీవ్రత తగ్గించేందుకు ప్రతిభవనానికి ఎర్తింగ్ తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలనే నిబంధనలు ఉన్నాయి. విద్యుత్ ఎర్తింగ్ ముఖ్యంగా మూడు రకాలుగా ఉంటాయి. అవి పైప్ ఎర్తింగ్, ప్లేట్ ఎర్తింగ్, స్ట్రిప్ ఎర్తింగ్ వీటితో పాటు న్యూట్రల్ ఎర్తింగ్ కూడా ఉంటుంది. జిల్లాలో ఎక్కువగా భవనాలకు ఎర్తింగ్ ప్లాంట్లు లేవని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు. ఇళ్లలో వినిటగించే విద్యుత్ సామర్థ్యం ఆధారంగా ఎర్తింగ్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలని, ఎలక్ట్రికల్ సర్క్యూట్లను భూమికి అనుబంధానం చేస్తూ పైప్, ప్లేట్ ఎర్తింగ్‌తో భవనాల్లో ఎర్తింగ్ పాయింట్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ప్రమాదాలను చాలావరకు నివారించవచ్చని సూచిస్తున్నారు. పరిశ్రమలతో పాటు అపార్టుమెంట్లలో విద్యుత్ వైరింగ్ వ్యవస్థలో లోపాలను పరిశీలించేం దుకు విద్యుత్ తనిఖీ విభాగం ఉన్నా గృహాలు, షాపుల్లో ఎలక్ట్రికల్ ప్రమాదాల నివారణకు ఎలాంటి ప్రత్యేక వ్యవస్థ లేదని, దీంతో తరుచూ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నిబంధనల ప్రకారం కనీసం అయిదేళ్లకోసారి గృహాల్లో వైరింగ్‌ను తనిఖీ లేదా మార్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సింగిల్ ఫేజ్, న్యూట్రల్ వైర్లు సమాన పరిమాణంలో ఉండేలా చూసుకోవాలంటున్నారు.

● ఎంసీబీ, ఆర్‌సీసీబీలు..

కరెంటు సరఫరాలో లీకేజీలను అరికట్టేందుకు ఎంసీబీ(మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్) ప్రతి ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలి. రెండు ఫేజ్‌లు కలిసినప్పుడు ఓల్టేజీలో హెచ్చుతగ్గులు తలెత్తినప్పుడు ఎంసీబీ వెంటనే ట్రిప్పయి కరెంటు సరఫరా నిలిచి పోతుంది. ఇళ్లలో మెట్రో కరెంటు ఇన్‌స్టలేషన్ లీకేజీలను అరికట్టేందుకు ఆర్‌సీసీబీ(రెడ్యువల్ కరెంటు సర్క్యూట్ బ్రేకర్) ఏర్పాటు చేసుకోవాలి. చాలా ఇళ్లలో ఆర్‌సీసీబీలు ఏర్పాటు చేసుకోవడం లేదు. ఆర్‌సీసీబీ ఏర్పాటు చేసుకుంటే షార్ట్ సర్క్యూట్ అయితే వెంటనే విద్యుత్ సరఫరా నిలిచి పోతుంది. రెండేళ్లకోసారి ఇళ్లలో వైరింగ్ సామర్థ్యాన్ని తనిఖీ చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

● పైప్ ఎర్తింగ్

పైప్ ఎర్తింగ్‌కోసం 38 మిల్లీమీటర్ల వ్యాసం, రెండు మీటర్ల పొడవుగల పైపును సాధారణంగా ఉపయోగిస్తారు. దీనిని 2-3 మీటర్ల లోతులో భూమిలో పాతిపెడతారు. పైపు చుట్టు బొగ్గు, ఉప్పు వేసి తేమను నిలపుకోవడం ద్వారా ఎర్త్‌రెసిస్టెన్స్‌ను తగ్గి స్తారు. పైప్‌ఎర్తింగ్ ఇంటి విద్యుత్‌వ్యవస్థలు, పారిశ్రామిక విద్యుత్‌వ్యవస్థలు, ట్రాన్స్‌మిషన్ టవర్ల వంటి వివిధ అనువర్తనాల్లో ఉపయోగిస్తారు. ఇది ముఖ్యంగా తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలకు తేమ తక్కువగా ఉన్న ప్రాంతాలకు అనుకూలంగా ఉంటుంది. ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్నది. విద్యుత్ షాక్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది.

● ప్లేట్ ఎర్తింగ్..

ఈ ప్లేట్ ఎర్తింగ్ పద్ధతిలో (60-60 సెంటీ మీటర్లు) కొలతలు కలిగిన ప్లేటును60 సెంటీమీటర్లలో తులో భూమిలో పాతిపెడతారు. దీనిలో 6.3మిల్లీ మీటర్ల లేదా 3.15 మందం గల గాల్వనైజ్డ్ స్టీల్ ప్లేట్ లేదా రాగిప్లేట్‌ను ఉపయోగిస్తారు. ఈ ప్లేటును గుంతలోకి నిలువుగా ఉంచి దానిచుట్టు బొగ్గు, ఉప్పువేసి ఎర్త్‌వైర్‌ను కనెక్ట్ చేస్తారు. అనంతరం గుంతను మట్టితో కప్పుతారు. ఇది తుప్పు పట్టకుండా ఉంటుంది. దీని ద్వారా భూమిలోకి తక్కువ నిరోధక మార్గాన్ని అందిస్తుంది. తద్వారా విద్యుత్ షాక్ ప్రమాదాన్ని తగ్గించి విద్యుత్ పరికరాలను సురక్షితంగా ఉంచుతుంది.

● స్ట్రిప్ ఎర్తింగ్..

స్ట్రిప్ ఎర్తింగ్ అనేది తక్కువ నిరోధకత కలిగిన మెటాలిక్ స్ట్రిప్ ద్వారా విద్యుత్ ఉపకరణాల నుంచి భూమికి విద్యుత్‌ను ప్రసారం చేసే ప్రక్రియ. ఈ ఎర్తింగ్ కోసం గాల్వనైజ్డ్ స్టీల్ లేదా కాపర్ స్ట్రిప్స్‌లను ఉపయోగిస్తారు. విద్యుత్ ఉపకరణంలో ఏదైనా లోపం సంభవించినప్పుడు అధిక విద్యుత్ ప్రవాహం ఎర్తింగ్ సిస్టమ్‌లోకి వెళుతుంది. ఈ స్ట్రిప్ ఎర్తింగ్ ద్వారా విద్యుత్ ప్రవాహం భూమికిలోకి సురక్షితంగా ప్రవహించి విద్యుత్ షాక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. స్ట్రిప్ ఎర్తింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేటప్పుడు నిపుణుల సలహాలు తీసుకోవడం చాలా ముఖ్యమని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

వర్షాకాలంలో ఎక్కువ ప్రమాదాలు..

- రాజేశ్వర్, ఏడీఏ ఆపరేషన్, కౌటాల



వర్షాకాలం విద్యుత్‌ప్రమాదాలు ఎక్కువగా సంభ విస్తాయి. పలు గృహాల్లో ఏసీలు, గీజర్లు ఏర్పాటు చేసుకుంటున్నా భవనాలకు ఎర్తింగ్ ఉందా లేదా అనే విషయం పట్టించుకోవడం లేదు. ఏసీలు, గీజర్లు, వాషింగ్ మెషిన్, ఫ్రిజ్‌లు ఓవెన్లు లాంటివి ఉన్న ఇంట్లో ఎర్తింగ్ తప్పని సరిగా ఏర్పాటు చేసు కోవాలి. ఎర్తింగ్ ఏర్పాటువల్ల 90శాతం విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి.

గిరిజన గ్రామాల్లో శీత్లా భవాని పూజలు



కొత్తపల్లిలో సీతల భవానికి పూజలు చేస్తున్న ఆడపడుచులు

లింగాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకురని గిరిజన గ్రామాల్లో శీత్లా భవాని మాత పూజలు జోరుగా నిర్వహిస్తున్నారు. పూజల్లో భాగంగా ఆడపడచులు పుణ్య స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో నైవేద్యం, పానకం, తయారు చేస్తారు. ఈ సందర్భంగా ఆడ పడచులు ప్రత్యేక పాటలు పాడుతు, నృత్య ప్రదర్శనలు చేస్తూ సాంప్రదాయబద్ధంగా శీత్లా భవాని మాతను మొక్కుకున్నారు. భోగ్ భండార్ నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని కొత్తపల్లిలో ఆదివారం గ్రామ నాయక్ మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో శీత్లా మాత భవాని పూజల సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ వెస్ ఎంపీపీ ఆత్మారాం, మాజీ సర్పంచ్ ఉదయ్ లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో ప్రభుత్వ కళాశాల

● ప్రతీ తరగతి గదిలో సీసీ కెమెరా ● బోధన, విద్యార్థుల అభ్యసనపై అధికారుల పర్యవేక్షణ

సిర్పూర్(టి), జూలై 20 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధికారులు ఇటీవల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనా పద్ధతులు, లెక్చరర్ల సమయపాలన, విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లో ప్రతీ తరగతి గది, ల్యాబ్, ప్రిన్సిపాల్ గదిలో ఒక్కో సీసీ కెమెరా బిగిస్తున్నారు. ఒక్కో కళాశాలలో పదికి తగ్గకుండా సీసీ కెమెరాలను బిగిస్తున్నారని చెబుతున్నారు. విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా గుణాత్మక నైపుణ్య గల బోధన అందించాలని లక్ష్యంతో సిబ్బంది పని తీరు, విద్యార్థుల హాజరు నమోదు తదితర అంశాలను దృష్టి పెట్టేకుని వేల రూపాయల విలువ గల 13 సీసీ కెమెరాలను అన్ని తరగతి గదులలో ఏర్పాటు చేశారు. దీంతో ఇక నుంచి ప్రతి విషయం సంబంధిత జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవడానిక మార్గం సుగమమం అయింది. దీంతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యాబోధనకు సంబంధించి కొత్త అంశాలను సైతం వీసీ ద్వారా విద్యార్థులు తెలుసుకోవడానికి అవకాశం ఉంది. రానున్న రోజుల్లో ఇంటర్ విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన అయ్యే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఇదే తరహాలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ఉప్పొంగిన వాగులు

బెజ్జూరు/చింతలమానేపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు, చింతలమానేపల్లి మండలాల్లో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి వాగులు, ఒర్రెలు ఉప్పొంగుతున్నాయి. బెజ్జూరు మండలంలో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి మండలంలోని వాగులు, వంకలు పొంగి పోర్లడంతో రాక పోకలకు అంతరాయం కలిగింది. కుశ్నపల్లి, సోమిని గ్రామాల మధ్యలో లోలెవల్ వంతెనల పై నుంచి వరద నీరు ప్రవహించడంతో మధ్యాహ్నం వరకు రాక పోకలకు పూర్తిగా స్తంభించి పోయాయి. వాగు అవతల ఉన్న సుస్మీర్, సోమిని, మొగవెల్లి, ఇప్పలగుడా, నాగెపల్లి, బండలూడ, గొర్రెగూడ తదితర గ్రామాలకు రాక పోకలు నిలిచి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దశాబ్దాలుగా లోలెవల్ వంతెనల పై హై లెవల్ వంతెనలు లేక పోవడంతో ప్రతి యేటా వర్షాకాలంలో అవస్థలు ఎదుర్కొంటున్న తమ ఇబ్బందులు ఎవరు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతల మానేపల్లి మండలంలో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి మండలంలోని వాగులు, వంకలు పొంగి పోర్లడంతో రాక పోకలకు అంతరాయం కలిగింది. దిందా- కేతిని గ్రామాల మధ్యలో లో లెవల్ వంతెనల పై నుంచి వరద నీరు ప్రవహించడంతో మధ్యాహ్నం వరకు రాక పోకలకు పూర్తిగా స్తంభించి పోయాయి. బాబాసాగర్, నాయకపుగూడ వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో రాక పోకలు నిలిచిపోయాయి. ఏటా వర్షాకాలంలో అవస్థలు ఎదుర్కొం టున్న తమ ఇబ్బందులు ఎవరు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కాగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివారం అత్యధిక రెబ్బెన మండలం వంకుళంలో 15.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సిర్పూర్(టి) మండలం లోనవెల్లిలో 2.8, వాంకిడిలో 2.8, ఆసిఫాబాద్‌లో 2.5, కాగజ్‌నగర్‌లో 2.0 తిర్యాణి మండలం గిన్నెధరిలో 1.5, కెరమెరి మండలం ధనోరాలో 1.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.



బెజ్జూరులో లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న కుశ్నపల్లి వాగు



చింతలమానేపల్లి వాగు వద్ద పోలీసు బందోబస్తు

స్నేహితులతో సరదాగా వెళ్లి.. మృత్యు ఒడికి చేరి..

మట్టి కుప్పను ఢీకొని బావిలో పడి ఇంటర్ విద్యార్థి మృతి



వంశీకృష్ణ(ఫైల్)

దండేపల్లి జూలై 20 (ఆంధ్రజ్యోతి): బోనాల పండగ సెలవులు ఓ ఇంటర్ విద్యార్థి ప్రాణాలు తీసింది. స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలపై పల్లె అందాలను చూసేందుకు వెళ్లిన ఆ యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృత్యు ఒడికి చేరాడు. ఆదివారం ఉదయం దండేపల్లి మండలం నంబాల గ్రామ శివారులో చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదం నింపింది. స్థానిక ఎస్సై తహసీనోద్దీన్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్షెట్టిపేటకు చెందిన రుద్ర వంశీకృష్ణ (16) ఇంటర్ చదువుకున్నాడు. ఆదివారం ఉదయం వంశీకృష్ణ ఇంటి నుంచి తన స్నేహితులతో కలిసి ఐదు ద్విచక్ర వాహనాలపై దండేపల్లి మండలం గూడెం రింగ్ రోడ్డు గుండా వెల్గనూర్ వైపు వెళ్లారు. ఈ క్రమంలో నంబాల గ్రామ శివారులో రాగానే రోడ్డు పక్కన ఉన్న మొరం కుప్పను వంశీకృష్ణ బలంగా ఢీకొట్టాడు. దీంతో అదుపు తప్పి అక్కడే ఉన్న ఓవ్యవసాయ బావిలో ఎగిరి పడ్డాడు. వంశీకృష్ణకు ఈత రాకపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. బైక్ వెనుకాల ఉన్న ఎంబడి వర్షిత్‌వర్మ మొరం కుప్పపై పడడంతో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. వంశీకృష్ణ హైదరాబాద్‌లోని ఓప్రైవేటు కళాశాలలో చేరాడు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఇంటికి వచ్చాడు. పది నెలల క్రితమే వంశీకృష్ణ తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. తల్లి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తుండగా, సోదరుడు మలేషియాలో ఉద్యోగం చేస్తున్నాడు. పది నెలల వ్యవధిలో కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో విషాదం అలుముకుంది.

చికిత్స పొందుతూ రైతు మృతి

భీమారం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని ఎల్బీపేట గ్రామానికి చెందిన కంకణాల మల్లారెడ్డి (55) హైద్రాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు భీమారం ఎస్‌ఐ శ్వేత తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మల్లారెడ్డిది జైపూర్ మండలంలోని టేకుమట్ల గ్రామం కాగా పదేళ్ల క్రితం భీమారం మండలంలోని ఎల్బీపేట గ్రామంలో నివాసం ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. మల్లారెడ్డి రెండు రోజుల క్రితం తన పొలానికి ఎడ్లబండిపై వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబీకులు మంచిర్యాలలోని ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు. మల్లారెడ్డికి భార్య లక్ష్మీ, కుమారుడు సతీష్‌రెడ్డి ఉన్నారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దండెపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్కి వెంకటాపూర్ పంచాయతీ పరిధిలోని ఎల్లాయపల్లెకు చెందిన సల్లూరి సురేష్, నందిత అనే ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మేదరిపేట నుంచి లక్షెట్టిపేట వైపు వస్తున్న కారు అదే వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్ పైన ప్రయాణిస్తున్న సురేష్, నందిత గాయపడ్డారు. స్థానికులు వారిని వెంటనే లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. ఎస్సై తహసీనొద్దీన్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, రోడ్డు ప్రమాదం జరిగింది నిజమేనని తెలిపారు.

12 లీటర్ల గుడుంబా స్వాధీనం

ఆసిఫాబాద్ రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం సాలెగూడ శివారులో అక్రమంగా తరలిస్తున్న 12 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాలతో సాలెగూడ శివారులో ఆకస్మికంగా దాడి నిర్వహించగా గ్రామానికి చెందిన నాగోసే విక్రమ్ అనే వ్యక్తి గుడుంబా తరలిస్తూ పట్టుకున్నామని చెప్పారు. గుడుంబాను స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు దేవేంద్రకుమార్, సంజీవ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కెరమెరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం కేస్లాగూడ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగల ముసుగులో కారులో వచ్చి కౌటాల మండలంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న కోవ కైలాస్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లోకి చొరబడి తాళం పగుల గొట్టి ఎల్‌ఈడీ టీవీ, ఇతర వస్తువులను దొంగతనం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి వస్తువులు దొంగలించుకు పోవడంతో గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

రేపు జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

కాగజ్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలుర, బాలిక జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు మంగళవారం కాగజ్‌నగర్ తమిల్‌మందిరం పాఠశాల సర్‌సిల్క్ కాలనీలో చేపడుతున్నట్టు బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు, కార్యదర్శి ఎంశేఖర్ ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. పాల్గొనే వారు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితులకు ఆదివారం ఎమ్మెల్యే హరీష్ బాబు అందజేశారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం కేంద్ర కమిటీ ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షుడిగా డీజీఎం గోళ్ల రమేశ్

కృష్ణకాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కేంద్ర కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. భూపాలపల్లిలోని సింగరేణి ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల నుంచి సుమారు 200 మంది పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గోళ్ల రమేశ్ (డిప్యూటీ జనరల్ మేనేజర్-కొత్తగూడెం ఏరియా), ప్రధాన కార్యదర్శిగా భూక్య కృష్ణమూర్తి (ఫిట్టర్- భూపాలపల్లి ఏరియా) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికా రిగా భూపాలపల్లి ఏరియా లైజన్ ఆఫీసర్ కల్లీ రమేష్ వ్యవహరించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాయి పవన్ (కొత్తగూడెం ఏరియా), సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా వాంకుడోతు శివ, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా బొర్రా రాంబాబు (భూపాలపల్లి ఏరియా), ఉపాధ్యక్షులుగా ఇస్లావత్ దిలీప్‌కుమార్ (శ్రీరాంపూర్ ఏరియా), అంబి రాజు (ఆర్జీ1 ఏరియా), బాలు నాయక్ (కొత్తగూడెం ఏరియా), కరుణాకర్ (భూపాలపల్లి ఏరియా), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నాగేశ్వర్ నాయక్ (మణుగూరు ఏరియా), బి.భీమా (ఆర్జీ1 ఏరియా), బానోత్ తిరుపతి (మందమర్రి ఏరియా), జాయింట్ సెక్రటరీలుగా ఇరుప కృష్ణ (కొత్తగూడెం ఏరియా), బానోత్ చంద్రశేఖర్ (ఆర్జీ2 ఏరియా), కిరణ్ (ఆర్జీ 1 ఏరియా), జి.ప్రేమ్‌లాల్ (మందమర్రి ఏరియా), ట్రెజరీగా ప్రశాంత్, జాయింట్ సెక్రటరీగా చంద్రయ్య(భూపాలపల్లి) ఎన్నికయ్యారు.

పేరుకే స్టేషన్.. ఆగని రైళ్లు

సిర్పూర్(టి), జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు నియోజక వర్గాల్లో సిర్పూర్ ఒకటి. మహారాష్ట్ర సరిహద్దు కలిగిన ఉన్న ఈ ప్రాంతవాసులకు రవాణా పరంగా సౌకర్యం అంతంతమాత్రమే. సిర్పూర్(టి)లో రైల్వే స్టేషన్ ఉన్నప్పటికీ పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ లేక పోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం రెండు ప్యాసింజర్ రైళ్లు మాత్రమే నిలుపుదల ఉండడంతో మండల వాసులు సిర్పూర్(టి) నుంచి 18 కిలో మీటర్ల దూరంలో ఉన్న కాగజ్‌నగర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. బెజ్జూరు, చింతలమానేపల్లి, కౌటాల మండలాల ప్రజలకు సిర్పూర్(టి) ప్రధాన కూడలి. ఈ ప్రాంత ప్రజలకు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో వ్యాపార, కుటుంబపరంగా సంబంధాలు కలిగి ఉండడంతో నాగ్‌పూర్, చంద్రాపూర్ పట్టణాలకు తరుచూ రాక పోకలు సాగిస్తుంటారు. దీంతో పాటు రాష్ట్ర రాజధాని హైదారాబాద్‌కు పనుల నిమిత్తం వెళ్తుం టారు. ఇక్కడి స్టేషన్‌లో రైళ్ల నిలుపుదల లేక పోవడంతో అవస్థలు పడుతున్నా రు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స ల కోసం పట్టణాలకు వెళ్లాల్సి వస్తే రాత్రి 2 గంటలకు కాగజ్‌నగర్ వెళ్లి అక్కడి నుంచి భాగ్యనగర్ రైలు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు రైలు టికెట్ ఒక్కరికి రూ.125 ఉండగా సిర్పూర్ (టి) నుంచి కాగజ్‌నగర్ వరకు రాత్రి వేళల్లో ఆటోలో ఖర్చు రూ.600 నుంచి రూ.800 వరకు అదనపు భారం పడుతుందని ప్రజలు చెబుతున్నారు.

ఉన్నత చదువులకు..

ఉన్నత చదువుల కోసం నియోజకవర్గంలోని విద్యార్థులు చాలా మంది హైదరాబాద్, విజయవాడ, చంద్రాపూర్, నాగ్‌పూర్ వంటి నగరాలకు వెళ్తుంటాంఽ. వారితో పాటు ఉపాధి కోసం, వ్యాపార నిమిత్తం వెళ్లే వారు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతన్నారు. సిర్పూ ర్(టి) నుంచి హైదరాబాద్ కు బస్సులో టికెట్ రూ.700 ఉండడంతో భారంగా మారింది. కరోనా మహమ్మారి ముందు భాగ్యనగర్, నాగ్‌పూర్ ప్యాసింజర్ రైళ్లు సిర్పూర్ (టి)లో ఆగేవి. కరోనా సమయంలో వీటిని రద్దు చేశారు. అనంతరం పునరుద్ధరించినా ఇక్కడ హాల్టింగ్ ఇవ్వలేదు.



సిర్పూర్(టి)లోని రైల్వే స్టేషన్

పట్టించుకోని నాయకులు..

కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండగా స్థానికంగా ఎంపీ, ఎమ్మెల్యేలు ఆ పార్టీకి చెందిన వారే ఉన్నారు. అయినా సమస్య పరిష్కరించక పోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు ఈ సమస్యపై చర్చించి త్వరలోనే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను సిర్పూర్(టి) వరకు పొడిగిస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు నెరవేర్చ లేదు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బదులు గుర్తించి పాల కులు, అధికారులు పరిష్కరించాలని కోరుతు న్నారు. ఈ విషయమంపై ఆదిలాబాద్ ఎంపీ గొడెం నగేష్‌ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా సిర్పూ ర్(టి) రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కార్మికుల హక్కులకు ఏఐటీయూసీ పెద్దదిక్కు



యూనియన్‌లో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న సీతారామయ్య

మందమర్రిటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో కార్మికుల హక్కులకు తమ యూనియన్ పెద్ద దిక్కు అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కార్మి కులకు ఏం చేయని సంఘాలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. తాము ఇప్పటికే సింగరేణిలో ఆరుసార్లు గుర్తింపు సంఘంగా ఎన్నికయ్యామని, కార్మికులపై తమపై ఎంతో నమ్మకం ఉందన్నారు. ఎంతో చరిత్ర గల తమ యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. కార్మికుల సొంతింటి కలను నెరవేరుస్తామని, మారుపేర్ల మార్పునకు, ఇన్‌కంటాక్స్ రద్దు, నూతన గనుల ఏర్పాటు కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్, కంది శ్రీనివాస్, దాగం మల్లేష్ పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంసీపీఐయు నాయకులు

బెల్లంపల్లి, జూలై20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని ఎంసీపీఐయు జిల్లా సహాయ కార్యదర్శి పసు లేటి వెంకటేశ్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ ఎన్నో ఏళ్లుగా హోంగార్డులు చాలిచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ప్రభుత్వం వేతనాలు పెంచి ప్రతి నెల 2వ తేదీలోపు వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. రాష్ట్రంలో 15వేల మందికిపైగా హోంగార్డులు ప్రజలకు సేవలందిస్తున్నారని వారి పట్ల నిర్లక్ష్యం చూపడం సరైందికాదన్నారు. హోంగార్డుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. 2016 నుంచి హోంగార్డు కుటుం బాలకు కారుణ్య నియమకాలు లేక వారి కుటుంబాలు దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నాయన్నారు. పోలీసు కానిస్టేబుళ్లకు సమానంగా టీఏ,హెచ్ఆర్ఏ లాంటి అలవెన్స్‌లు ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే హెల్త్ కార్డులు సైతం అందించాలని పేర్కొన్నారు. నాయకులు రమేశ్, సతీష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సిడాం శంభు వర్ధంతి



నివాళులు అర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

కాసిపేట, జూలై20 (ఆంధ్రజ్యోతి): తుడుం దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు సిడాం శంభు వర్ధంతిని ఆదివాసం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు మాట్లాడుతూ ఆదివాసి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన మొదటితరం గిరిజన నాయకుడు సిడాం శంభు అన్నారు. వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆర్ఎఫ్ఆర్ చట్టాన్ని తీసుకొచ్చి ఆదివాసీలకు అడవుల పై పూర్తి హక్కులను సాధించిన ఘనత ఆయనదే అన్నారు.

అనంతరం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పెంద్రం హన్మంతు, కనకరాజు, మడె అనంతరావు, సంద్ర భూమన్న, ఆత్రం జంగు, సోయం సూరు, మడావి ధర్మరావు, కనక గోవర్ధన్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

కోటపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి) : ఇటీవల గోడ మీద పడి మృతిచెందిన కూలీలు రెడ్డి మధునయ్య, శేగం తిరుపతిల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ ఆదివారం ఆర్థిక సహాయం ప్రకటించారు. కాగా ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకులు కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, ఎల్లాగౌడ్, బాపు, మల్లయ్య, శ్రీనివాస్, వెంకటి దేవేందర్, విజయ్ పాల్గొన్నారు.

శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు

- ఘనంగా అదిపరా శక్తి బోనాల జాతర
- ప్రత్యేక పూజలు చేసిన మంత్రి వివేక్
- అమ్మవారిని దర్శించి పూజలు చేసిన భక్తజనం..

నస్పూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్ట ణం తీగల్ పహాడ్‌లోని ఆదిపరా శక్తి భువనేశ్వరి మా త దేవాలయం ఆషాఢ మాస బోనాల ఉత్సవం ఆది వారం కన్నుల పండగగా జరిగింది. ఆషాఢ మాస బో నాల ఉత్సవాల్లో భాగంగా సీసీసీ కార్నర్ నుంచి ఆల యం వరకు డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపు సాగింది. పెద్ద ఎ త్తున భక్తులు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజ లు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్మిక శాఖ మం త్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఉత్సవాల్లో పాల్గొన్నా రు. ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశా రు. మంత్రి మాట్లాడుతూ సంప్రదాయాలను గౌరవి స్తూ ప్రజల నమ్మకానికి విలువ ఇవ్వడమే ధర్మమ న్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు కుటుంబ సభ్యులు కొక్కిరాల రోజా బోనం ఎత్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసం తోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, 21వ వార్డు ఇన్‌చార్జి ధర్ని మధూకర్, నస్పూర్ పట్టణ ఇన్‌చార్జి నూకల రమేష్, పీసీసీ కో ఆర్డినేటర్ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

● మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు బోనం ఎత్తి అమ్మవారికి పూజలు చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. శ్రీరాం పూర్ జనరల్ మేనేజర్ ఎం. ఉమారాణి-శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అదిపరా శక్తి అమ్మవారి బోనాల ఉత్సవం కన్నుల పండుగగా, ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ వంగల దయానంద్, వంగల వివేకనంద్, అర్చకులు రఘు మహారాజ్ భక్తులు పాల్గొన్నారు.

● నస్పూర్ పట్టణం సీసీసీ టౌన్‌షిప్‌లో మడేలయ్య స్వామి బోనాల జాతర ఘనంగా జరిగింది. మడేలయ్య ఆలయం వరకు బోనాలతో రజకకులు ఊరేగింపు నిర్వహించారు. మడేలయ్య స్వామి, సీతాలమ్మ, ఈదమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. రజక సంఘం మండల అధ్యక్షుడు దొడ్డిపల్లి రవీందర్, జిల్లా అధ్యక్షుడు తంగల్లపల్లి బాపు, నాయకులు పైడిద్ద, రాజు, సారయ్య, రాజయ్య, తిరుపతి, ఓదెలు, శంకర్, బాలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ఆషాఢమాస నేపథ్యంలో ఆదివారం పట్టణంలో ప్రజలు ఘనంగా బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాల వద్దకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల నేపథ్యంలో పలు దేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి.

శ్రీరాంపూర్ : ఆషాడమాసంను పురస్కరించుకొని శ్రీరాంపూర్‌లో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. పలు వార్డులకు చెందిన మహిళలు వేల సంఖ్యలో బోనాలు నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పుళ్ల నడుమ కొత్తరోడ్డులోని పోచమ్మ ఆలయం వరకు వచ్చారు. అక్కడ అమ్మవారికి బోనాలు సమర్పించారు.

మంచిర్యాల కలెక్టరేట్ : ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండి ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో ఉండాలని కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు కొక్కిరాల రోజా పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని హమాలీ వాడలో గల గంగమ్మ తల్లి బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. హమాలీ వాడ నుంచి ఐబీ చౌరస్తా వరకు బోనాలతో డప్పుచప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గంగాదేవి బోనాల జాతర ఆహ్వాన కమిటీ నాయకులు యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

● బోనాల వేడుకలు సంస్కృతికి చిహ్నమని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రామ్ నగర్‌లో బోనాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మొక్కులు చెల్లించుకున్నారు.

● మంచిర్యాల పట్టణంలో ఆదివారం అఖిలగాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో కట్ట పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లం పూర్ణిమ, ఎమ్మెల్యే సోదరి రోజారాణి హాజరయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు హరి ప్రసా ద్, చంద్రమౌళి పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : ఆషాఢమాసంలో అమ్మ వారికి బోనాలు సమర్పించడం తెలంగాణ సంప్రదాయమని రాష్ట్ర గనులు, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. బోనాలకు మంత్రి హాజరై బోనమెత్తుకుని అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట: ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో ప్రజలు బోనాల జాతరను ఘనంగా బోనాల వేడుకలను నిర్వహించారు. శివసత్తులు పోతరాజులతో బోనాలు అట్టహాసంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు భక్తులు ప్ర త్యేక పూజలు నిర్వహించారు.

జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామం లో ఆదివారం కవ్వాల్ పోచమ్మకు బోనాలు చేశారు. ఇంటికో బోనం చొప్పున భారీ సంఖ్యలో మహిళలు, పిల్లలు బోనాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు భారీ ర్యాలీగా బయలుదేరారు.

మందమర్రిటౌన్: పట్టణంలో ఆదివారం భవానీ అమ్మవారి ఉజ్జయిని బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్, కేకే సీఎస్పీ అంగడి బజార్ ఏరియా నుంచి మహిళలు ఊరేగింపుగా కామాక్షి ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపులో చిన్నారులు నృత్యాలు చేశారు. అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

జైపూర్ : రసూల్‌పల్లి గ్రామంలో శ్రీచైతన్య పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో బోనాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు అమ్మవారి రూపాన్ని ధరించి అలరించారు. పోచమ్మ తల్లి వేషధారణలో నృత్యాలు చేస్తూ అందర్ని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లో పూజలు చేస్తున్న మంత్రి వేక్‌వెంకటస్వామి



నస్పూర్‌లో బోనాల ఊరేగింపు



నస్పూర్‌లో ఆదిపరాశక్తి ఆలయంలో మంత్రి వివేక్ పూజలు



కాసిపేటలో బోనాలతో వెళ్తున్న మహిళలు



మందమర్రిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



బోనమెత్తుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రోజా



నస్పూర్‌లో బోనం ఎత్తిన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర ప్రగతికి కట్టుబడి పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. ఆదివారం మండలంలోని బొక్కలగుట్ట సమీపం లోని రైతు వేదికలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయనహాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం కోలుకోని విధంగా దెబ్బతిందని, సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో పనిచేస్తూ సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. లోటు బడ్జెట్ ఉన్నా పెద్ద ఎత్తున పథకాలకు నిధులను కేటాయిస్తూ ప్రజల అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. బొక్కగుట్ట, పులిమడుగు, తిమ్మాపూర్ గ్రామాలను క్యాతనపల్లి మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ కావాలని రైతులు కోరుతున్నారని మంజూరయ్యేలా చూస్తానని తెలిపారు. అన్నదాతలకు అండగా ఉండడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బొక్కల గుట్ట ప్రాంతంలో నిర్మిస్తున్న వెంకటేశ్వర ఆలయానికి విద్యుత్ సౌకర్యంతోపాటు తాగునీరు సౌకర్యాలను సమకూర్చాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు , రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

కరుగుతున్న గుట్ట..

(5వ పేజీ తరువాయి)

తమ పరుధిల్లోనే తవ్వకాలు చేపడుతున్నారా, పరిధి దాటుతున్నారా అనే అంశంతో పాటు ఎంత విస్తీర్ణంలో రాయి, మట్టి తవ్వకాలు జరుగుతున్నాయో సర్వే జరిపి మైనింగ్ శాఖ అధికారులకు రిపోర్టు చేయాలి. ప్రస్తుతం ఆయాసంస్థలు ఎలాంటిసర్వే జరపకపోవడంతో గుట్టలో అక్రమ వ్యాపారానికి అడ్డులేకుండా పోయింది.

సోలార్ ప్రాజెక్టు పేరుతో...

అందుగులపేట గుట్టపై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రత్యేక చొరవతో ఒక మెగావాట్ సామర్థ్యంగల ఇందిరా మహిళాశక్తి సోలార్ పవర్ ప్రాజెక్టుకు రూ.3కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇతర మంత్రులు ఇటీవల శం కుస్థాపన చేశారు. దాని సమీపంలోనే రాష్ట్ర ప్రభుత్వ పథకమైన యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనం నిర్మాణం కూడా జరుగుతోంది. దీం తో వాహనాల రాకపోకల కోసం గుట్టపైన చదును చేశారు. ఈ ప్రక్రియ దాదాపుగా పూర్తయింది కూడా. ఇదే అదునుగా కాంట్రాక్టర్లుగా అవతార మెత్తిన వారు గుట్ట చుట్టూ అక్రమంగా తవ్వకాలు చేపడతూ మొరం, మట్టిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా, గుట్ట వద్ద నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారనే సమాచారంతో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే నేతృత్వంలో మైనింగ్‌శాఖ అధికారులు ఈ నెల 19న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



వెంకటాపూర్ సమీపంలో ఓ స్థలంలో పోసిన గుట్ట మట్టి

ఉర్సు ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఉర్సు కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ

తాండూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉర్సు ఉత్సవాలను ప్రశాం తంగా జరుపుకోవాలని తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉర్సు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఖవ్వాలి ఉన్న నేపథ్యంలో ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాలకు వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఏదైనా సమస్య వస్తే అందుబాటులో ఉన్న పోలీసులకు తెలియజేయాలన్నారు. తాండూర్ లోపలికి వచ్చే వారు భక్త మార్కండేయ గుడి మూల మలుపు అశోక్‌నగర్ ప్రాంతం నుంచి, అలాగే రేచిని రోడ్ రైల్వేస్టేషన్ పెట్రోల్‌బంక్ అండర్ బ్రిడ్జి సమీపంలో గల రహదారి నుంచి వెళ్లాలన్నారు.

వన మహోత్సవంతో పచ్చదనం విస్తరించాలి



క్వారీ జంగిల్ సఫారీలో మొక్కలు నాటుతున్న అధికారులు

హాజీపూర్, జూలై20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఏలు సింగ్ మేరు లక్షెట్టిపేట అటవీ రేంజ్ పరిధిలోని పాత మంచిర్యాల అటవీ బీట్‌లో గల ఎంసీసీ క్వారీ అడవిలోని గాంధారీ ఖిల్లా జంగిల్ సఫారీలో ఆదివారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వన్యప్రాణి విభాగం ముఖ్య సంరక్షణ అధికారి ఏలు సింగ్ మేరు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ప్రత్యేక వాహనంలో జంగిల్ సఫారీలో పర్యటించి వివిధ రకాల వన్య ప్రాణులను వీక్షించి సఫారీలోని గడ్డి మైదానాలు, దట్టమైన అడవి ప్రాంతాలను, ప్రాచీన ప్రాంతాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫారెస్టు కన్జర్వేటర్ శాంతారాం, జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశీస్ సింగ్, అటవీ అభివృద్ధి అధికారి సర్వేశ్వర్ పాల్గొన్నారు.


మంత్రి వివేక్ పరామర్శ


కోటపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కోటపల్లి మండల కేంద్రానికి చెందిన శేగం తిరుపతి, రెడ్డి మధునయ్య అనే కూలీలు గోడ కూలి మృతిచెందగా వారి కుటుంబాలను ఆదివారం మంత్రి వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. వారి ఇళ్లకు వెళ్లి కుటుంబీకులను ఓదార్చారు. మృతుల కుటుంబాలను అన్ని రకాలుగా ఆదు కుంటామని, ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి తక్షణ సహాయంగా రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయ కులు ఆలూరి సంపత్, దుర్గం వెంకటస్వామి ఉన్నారు.

చిత్రం..భళా

- అద్భుతమైన పెయింటింగ్‌తో ఆకట్టుకుంటున్న చిత్రకారుడు
- ప్రముఖ నాయకుల నుంచి మొదలుకొని క్రీడాకారుల వరకు పెయింటింగ్స్
- పలు అవార్డులు, రివార్డులు

మందమర్రిటౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి) : పట్టుదల ఉంటే ప్రతీ రంగంలో రాణిస్తారనడానికి ఈ చిత్రకారుడు ఓ నిదర్శనం మాత్రమే. విద్యార్థి దశ నుంచి మంచి పెయింటర్ కావాలని కలలు కన్న ఆ యువకుడు దానిని సాకారం చేసుకున్నాడు. ప్రముఖుల ప్రశంసలు పొందడంతో పాటు పలు అవార్డులు కూడా సాధించాడు. హానికరమైన కలర్స్‌తో చిత్రాలు గీయకుండా సహజసిద్ధమైన ప్రకృతి ప్రసాదించిన కలర్లతో పె యింటింగ్స్ వేస్తూ అందరిని ఆశ్చర్యపోయేలా చేస్తు న్నాడు. ఇప్పటి వరకు వేలాది పెయింట్లు వేసి రాష్ట్ర వ్యాప్తంగా తనకంటూ ఓ గుర్తింపు సాధించాడు. పట్టణంలోని మూడో జోన్‌కు చెందిన తేలుకుంట్ల సత్యం అనే చిత్రకారుడు అద్భుతమైన పెయింటింగ్స్‌తో ఆకట్టుకుంటున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకుల నుంచి మొదలుకొని స్వాతంత్ర సమరయోధులు, ప్రముఖ సినీ నటులు, పథకాలు సాధించిన క్రీ డాకారుల చిత్రాలు గీస్తూ అందరి మన్ననలను పొందుతున్నాడు. ఈ పెయింటింగ్స్‌ను వాటర్ కలర్స్, పెన్సిల్‌తో పాటు చార్‌కోల్ పెన్సిల్స్, అక్రిలిక్ కలర్‌లు, ఆయిల్ పెయింటింగ్, ఇంక్‌పెన్ స్కెచ్‌లతో ఈ చిత్రాల ను గీస్తున్నాడు. బీఎస్సీ మ్యాథమెటిక్స్ పూర్తి చేసి ఆ ర్టిస్టు డిప్లమా కోర్సు పూర్తి చేశాడు. ఆన్‌లైన్ స్కెచ్‌తో చిత్రాలు వేయడంలో పట్టు సాధించాడు. ఆయన వేసిన పెయింటింగ్స్‌తో పలు వురు ప్రశంసలు పొందారు. పాఠశాల నుంచి మొదలుకొని ఇప్పటి వరకు పలు బహుమతులు కూడా సాధించాడు. 2018,19లో హైదరా బాద్ జూబ్లిహిల్స్ కొండాపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్యం ప్రథమ బహుమతిని సాధించాడు. ఆయన వేసిన తెలంగాణలో పూల పండుగకు సంబంధించి బతుకమ్మ చిత్రానికి మొదటి బహుమతి అం దుకున్నాడు. విజయవాడలో 2019లో ఆర్ట్ గ్యాలరీలో కూడా బహుమతి సాధించాడు. దేశ స్వాతంత్రానికి సంబంధించి గాంధీ, భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్, రాధా కృష్ణ, మదర్ థెరిస్సా, పల్లెటూరి మహిళల చిత్రాలను కళ్లకు కట్టినట్లు వేశారు.









సత్యం వేసిన చిత్రాలు

ప్రభుత్వ పాఠశాలలో నేర్పించాలి..

విద్యార్థుల్లో దాగి ఉన్నకలను వెలికి తీసేందుకు పెయింటింగ్ నేర్పించాలి. దీనికి తాను ఉచితంగా పిల్లలకు నేర్పించడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రభుత్వం తమకు సహకరించాలి. ఇలాంటి పెయింటింగ్స్‌తో పోటీలు కూడా నిర్వహించాలి. చిత్రకారులకు చిత్రప్రదర్శనకు అను మతులు ఇవ్వాలి.



\- సత్యం, పెయింటర్

జాతీయస్థాయిలో బహుమతి

లక్షెట్టిపేట జూలై 20 (ఆంధ్రజ్యోతి): రావిప్రోలు సుబ్రహ్మణ్యం స్మారకంగా విశాలాక్షి సాహిత్య మాసపత్రిక నిర్వహించిన జాతీయస్థాయి కవితల పోటీలో లక్షెట్టిపేటకు చెందిన ప్రముఖ్య కవి లేదాళ్ల రాజేశ్వర్‌రావు రెండవ బహుమతి సాధించాడు. ఆయన రాసిన 'కాస్త వెనుక..ఇంకాస్త ముందు' అనే కవితకు గాను జాతీయ స్థాయిలో ఉత్తమ గుర్తింపు లభించింది. నెల్లూరులో ఆదివారం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో రాజేశ్వర్ రావుకు బహుమతి ప్రదానం చేశారు. లక్షెట్టిపేటకు చెందిన కవులు నూటెంకి రవీంద్ర, చక్రవర్తి, శ్రీనివాస్, మల్లేషం అభినందించారు.

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

లక్షెట్టిపేట జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యాక్షుడు శ్రీకాంత్ కోరారు. లక్షెట్టిపేటలో ఆది వారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యను నిర్వీర్యం చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించకుండా కార్పొరేట్ విద్యా సంస్థలకు వాత్తాసు పలుకుతున్నారన్నారు. ఈనెల23న నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కార్తీక్, సుమంత్ సిద్దార్థ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల దాసు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 20(ఆంధ్రజ్యోతి) : కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబరు 282ను వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 282 ద్వారా దుకాణాలు, షాపింగ్‌మాల్స్, షోరూంలలో పనిచేసే కార్మికులకు 8 గంటల నుంచి 10గంటలు పనిచేయాలని సూచించడం దారుణమన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే ఈ జీవోను రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక చట్టాలను ప్రతిపాదించిన సవరణలు పూర్తిగా కార్మిక వ్యతిరేకమైనవని, ఇవి 2019,2020లో కేంద్రం ప్రకటించిన నాలుగు లేబర్ కోడ్‌లకు సరిగ్గా అనుగుణంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి పౌలు, కలీందర్ అలీఖాన్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు కలీందర్ అలీ ఖాన్, సుదర్శన్, వీరభద్రయ్య పాల్గొన్నారు.

కరుగుతున్న గుట్ట..



గుట్ట తవ్వి లారీల్లో నింపుతున్న మట్టి (ఫైల్)

- యథేచ్ఛగా మట్టి, మొరం తరలింపు
- అక్రమంగా రియల్ ఎస్టేట్ వెంచర్లకు విక్రయం
- నిత్యం పదుల సంఖ్యలో లారీల ద్వారా తరలింపు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మంచిర్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నాయకుల ధన దాహానికి ఓ గుట్ట కరిగిపోతోంది. ఎలాంటి అనుమతులు లేకపోయినా అక్రమంగా గుట్టను తవ్వి మొరం, మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా సంబంధిత మైనింగ్‌శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకుతా విస్తోంది. దండేపల్లి మండలం అందుగులపేట గ్రామ శివారులో సర్వే నంబర్ 9లో సుమారు 70ఎకరాల్లో గుట్ట విస్తరించి ఉంది. గుట్టలో ఉన్న మొరం, మట్టిమంచి నాణ్యతతో కూడినది కావడం, రోడ్లకు ఉపయోగిస్తే వర్షాకాలంలో బురదమయం కాకుండా ఉండటంతో దానికి రెక్కలు వచ్చాయి. స్థానిక నాయకులే కొందరు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి గుట్టలో అక్రమతవ్వకాలు చేపట్టడమే గాకుండా, బహిరంగంగా రియల్ ఎస్టేట్ వెంచర్లకు మొరం, మట్టి తరలిస్తూ అక్రమంగా లక్షలు సంపాదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు ఇలా...

అందుగులపేట గుట్టలో మట్టి తవ్వకాలకు సంబంధించి గనులు భూగర్భశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. అయినప్పటికీ నిత్యం పదులసంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లద్వారా రాత్రి, పగలు మట్టిని తరలిస్తున్నా అడిగేవారు కరువయ్యారు.

మొరం, మట్టి తవ్వకాలకు సంబంధించి మైనింగ్ శాఖ నిబంధనల మేరకు ముందస్తు పర్మిట్లు విధిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత మట్టి తవ్వకాలు జరిపిన పక్షంలో ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.75 అడ్వాన్స్ రాయాల్టీ, 30శాతం డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్టీ), 2శాతంస్టేట్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టు(ఎస్ఎంఈటీ) ఫీజులతోపాటు 2శాతం ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అది కూడా అధికారులు అనుమతులు జారీచేసిన ప్రదేశంలోనే మట్టితవ్వకాలు జరపాల్సి ఉంటుంది. ఇలా మట్టి తవ్వకాలు జరిపే ప్రతీసారీ ఇలాగే పర్మిట్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇవేమీ చెల్లించ కుండానే ప్రతి నిత్యం దాదాపు 500 క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించుకు పోతున్న ట్లు సమాచారం.

గుట్ట నుంచి తవ్విన మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్న సదరు కాంట్రాక్టర్లు (అనధికార) లక్షలు గడిస్తుండగా, ప్రభుత్వ ఆదాయా నికి పెద్దమొత్తంలో గండి పడుతోంది. కాంట్రాక్టర్లు మట్టితో పాటు పర్మిట్లు లేకుండా గుట్టలో రాయి తవ్వకాలు చేపడుతూ అందినకాడికి దండుకుంటున్నారు.

నిఘా వ్యవస్థ నిర్వీర్యం...

గుట్టలు, ఇతర ప్రభుత్వ భూముల నుంచి రాళ్లు, మట్టి తవ్వకాలపై నిఘా వేసేందుకు ఐదారు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం డీజీపీఎస్, ఈటీఎస్ అనే డిజిటల్ సర్వే బాధ్యతలను మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన ఓఏజెన్సీకి అప్పగించింది. ఆయా స్థలాల్లో జరుగుతున్న తవ్వకాలపై ఈ సంస్థ ఎప్పటికప్పుడు శాటి లైట్‌తో నిఘావేసి, ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల అప్రమత్తం చేయాలి. గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో అనుమతులున్న కాంట్రాక్టర్లు..

- మిగతా 7లో

మట్టి తవ్వకాలకు అనుమతుల్లేవు...

అందుగులపేట గుట్టలో మొరం, మట్టి తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా గుట్టలను తవ్వడం చట్టరీత్యానేరం. పర్మిట్లు ఉన్న కాంట్రాక్టర్లు మాత్రమే గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో మట్టి తవ్వకాలకు అర్హులు. అదికూడా వారికి ఇచ్చిన పరిధిలో మాత్రమే తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. అందుగులపేట గుట్ట లో అక్రమ తవ్వకాలపై దృష్టిసారించడం ద్వారా బా ధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- జగన్మోహన్‌రెడ్డి, మైనింగ్‌శాఖ జిల్లా ఏడీ

జిల్లా పవర్ డిప్లొమా కమిటీ ఎన్నిక

మంచిర్యాలక్రైం, జూలై20 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా పవర్ డిప్లొమా ఇంజనీర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నిర్మల్‌లో జరిగిన సమావేశంలో ఎలక్షన్ అధికారి నరేందర్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లా అధ్యక్షుడిగా నూక రాజశేఖర్, జిల్లా సెక్రటరీగా అన్నం రమేశ్, కన్‌స్ట్రక్షన్ మంచిర్యాల సర్కిల్ ఆర్గనైజర్, సెక్రటరీగా బండారి ప్రభాకర్, సర్కిల్ ట్రెజరర్‌గా కొట్టే మహేశ్‌లు ఎన్నికయ్యారు.

మొక్కులు చెల్లించుకున్న బీజేపీ నాయకులు



పూజలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

మందమర్రిటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొక్కలగుట్ట జాతీయ రహదారి పక్కన గల గాంధారి మైసమ్మ ఆలయంలోని అమ్మవారిని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్‌లు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారు మాట్లాడుతూ బోనాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారని, ప్రభుత్వం ఆలయాన్ని మరింత అభి వృద్ధి చేయాలని, ప్రభుత్వం నిధులను కేటాయించాలని పేర్కొన్నారు.

కిక్కిరిసిన గాంధారీ మైసమ్మ జాతర

- బోనమెత్తిన బొక్కల గుట్ట
- మొక్కులు చెల్లించుకున్న మంత్రి వివేక్



బోనం ఎత్తుకున్న మంత్రి వివేక్

రామకృష్ణాపూర్, జూలై20 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామం ఆషాఢ మాస బోనాల ఉత్సవంతో పులకించింది. గాంధారి మైసమ్మ ఆలయం వద్ద వేలాది మంది భక్తులు శివసత్తుల పూనకాలతో పులకించింది. రాష్ట్రంలో ఆషాడమాసం ఉత్సవాలతో గ్రామ దేవతలను పూజించే సంస్కృతిలో భాగంగా మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించేందుకు జిల్లా నలుమూలలతో పాటు మహారాష్ట్రంలోని చంద్రాపూర్, నాందేడ్, గడ్చిరోలి జిల్లాల నుంచి భక్తులు వచ్చి పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో జాతీయ రహదారి పక్కనగల గాంధారి మైసమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది.



జాతరలో పోటెత్తిన జనం

బోనంతో మంత్రి వివేక్...

రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్లాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అమ్మవారికి బోనం నెత్తిన పెట్టుకొని మొక్కులు చెల్లించి రాష్ట్ర ప్రజల సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించారు. మంత్రి మాట్లాడుతూ మైస మ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలన్నారు. నియోజకవర్గ అ భివృద్ధితో పాటు బొక్కలగుట్ట, గాంధారీ మైసమ్మ ఆలయ అభివృ ద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేకపూజ కార్యక్రమాలు చేశారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించగా మందమర్రి సీఐ శశిధర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేపట్టారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

- ఉమ్మడి జిల్లా బంద్‌కు సీపీఎం మద్దతు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : జీవో 49ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం చేపట్టిన ఉమ్మడి జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని బంద్‌కు తమ పార్టీ మద్దతు తెలుపుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలోని చార్వాక హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలను, ఇతర పేదలను భూమికి, ఊరికి దూరం చేసేలా జీవో నెంబరు 49ని మోదీ సర్కారుకు తలవంచి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురావడం అన్యాయమన్నారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌కు అందరు మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు అశోక్, చందు, రంజిత్‌కుమార్, మల్లీశ్వరి, ఉమారాణి, లింగన్న, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కోటపల్లి : గిరిజనులకఉ అన్యాయం చేసే జీవో 49ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ సోమవారం తలపెట్టిన ఉమ్మడి జిల్లా బంద్‌ను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ అన్నారు. ఆదివారం ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆదివాసీల మనుగడకు, సంప్రదాయాలకు ఆదివాసీ చట్టాలకు ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కొమురంభీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకువచ్చిన జీవో 49ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి రమేష్, రాష్ట్ర నాయకులు సెడెంక మాంతయ్య, డివిజన్ ఇన్‌చార్జీ దుర్గే జైలు పాల్గొన్నారు.

దండేపల్లి: ఆదివాసులను అడవులకు దూరం చేయవద్దని ఆదివాసి సేన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్ అన్నారు. ఫారెస్టు కన్జర్వేషన్ రిజ్వరు ప్రాజెక్టు పేరిటా ఆసిఫాబాద్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తీసుకవచ్చిన జీవో 49ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 21న ఆదివాసి సంఘాల తలపెట్టిన ఉమ్మడి జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లాలోని 49జీవోతో 339 గ్రామాలపై ప్రభావం పడుతుందన్నారు. వెంటనే 49 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్‌లో వాణిజ్య, వ్యాపార సంస్థలు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసి సంఘం నాయకులు మంగం సంతోష్, మాడావి హన్మంతు, కోమురం లాల్ సాబ్, తోడసం జంగు కనక పున్నంచందులు పాల్గొన్నారు.

ఏబీఏపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తిరుమల్ రావు

శ్రీరాంపూర్/మంచిర్యాల కలెక్టరేట్ జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సమితి (ఏబీఏపీ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా తిరుమల్‌రావు నియమితులయ్యారు. తమిళనాడులోని తిరువన్నామలైలో ఏబీఏపీ జాతీయ మహాసభ జరిగింది. ఈ సభలో గౌరవ అధ్యక్షుడు మీనన్, శబరిమల మేల్‌శాంతులు పాల్గొని జాతీయ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా అయ్యప్ప దాస్, ప్రధాన కార్యదర్శిగా బేతి తిరుమల రావును నియమించారు. ఆయన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం ఇది రెండవసారి. తిరుమలరావు అయ్యప్ప భక్తుడే కాకుండా ఏబీఏపీ ద్వారా పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. తన సొంత ఖర్చులతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఉద్యోగార్థులకు పుస్తకాలు అందిస్తూ, మౌలిక వసతులు కల్పిస్తున్నారు. తిరుమల రావు నియామకంపై మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చుంచు కిరణ్, గౌరవ అధ్యక్షుడు కొండు నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి ఎల్క సంతోష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రికి వినతి పత్రం ఇచ్చిన ఆటో కార్మికులు

నస్పూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం నస్పూర్‌లో పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి నస్పూర్ పట్టణ ఆటో కార్మికుల సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టిన తర్వాత గిరాకిలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలని విన్నవించారు. యాభై సంవత్సరాలు దాటిన కార్మికుడికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి కార్మికుడికి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ సౌకర్యం ఇవ్వాలని కోరారు.



మంత్రి వివేక్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆటో కార్మిక సంఘం నాయకులు

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

- మంత్రి వివేక్‌వెంకటస్వామి



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలపరుస్తామని చెప్పి పట్టించుకోలేదని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కిష్టంపేట గ్రామంలోని బీఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఇందిర మహిళ శక్తి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. సుమారు 246 మహిళ సంఘాలకు రూ. 25 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను కలెక్టర్ కుమార్ దీపక్‌కు కలిసి పంపిణీ చేశారు. అలాగే కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి లక్ష కోట్ల నిధులను వృథా చేసిందన్నారు. ప్రాజెక్టుతో కాంట్రాక్టర్లు ధనవంతులయ్యారన్నారు. ఈ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో పంటలు మునిగిపోయి రైతులు నష్టపోయారని, దీంతో నష్ట పరిహారం ఇవ్వాలని గత ప్రభుత్వంతో తాను కొట్లాడానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. వడ్డీ లేని రుణాలతో మహిళలు ఆర్థికంగా ఎద గాలన్నారు. అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని తెలిపారు. చెన్నూరు నుంచి కొత్తగా ఐదు బస్సులను ప్రారంభించామని, చెన్నూరులో బస్ డిపో ఏర్పాటు చేయాలని రవాణా శాఖ మంత్రిని కోరానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీవో కిషన్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీ డీవో మోహన్, ఐకేపీ సిబ్బంది, మహిళ ంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రూ. వంద దాటిన పచ్చిమిర్చి

- కొనేందుకు వెనుకాడుతున్న మధ్యతరగతి జనం

దండేపల్లి జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి వంటింట్లో తప్పనిసరిగా వాడాల్సిన పచ్చిమిర్చి ధర చూస్తే కంట నీరు తెప్పిస్తోంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గడంతో పచ్చిమిర్చి ధర రోజు రోజుకూ ఘాటుక్కుతోంది. ఇప్పటికే సెంచరీ కొట్టిన పచ్చిమిర్చి ధర ప్రస్తుతం కిలోకు 120కి చేరుకుంది

దిగుబడి తగ్గడంతోనే..

పచ్చిమిర్చి ధర రూ 10కి పావుకిలో అంటేనే ఎక్కువ అనిపిస్తుంది. పక్షం రోజుల క్రితం ధర కిలో 50 నుంచి 60 వరకు కిలో ఉండే, మిర్చి ఇప్పుడు సెంచరీ కొట్టింది. ఆలాంటిది పావుకిలో పాతిక రూపాయలు దాటగా సామాన్య మధ్య తరగతి ప్రజలు కొనేందుకు వెనుకాడుతున్నారు. అయితే దీనికి కారణం పంట దిగుబడి తగ్గడమేనని తెలుస్తోంది. స్థానికంగా మిర్చి పంట లేకపోవడంతో దూర ప్రాంతాల



నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ధరలు పెరిగాయంటూ వ్యాపారులు అంటున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి రవి

జైపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెన్నూరు జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పుట్టుక నుంచి మరణం వరకు చట్టాలు కలిగి ఉన్నాయన్నారు. మహిళల పట్ల ప్రతి ఒక్కరు గౌరవం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. చదువుకునే వయస్సులో చెడు వ్యసనాలకు అలవాటు పడి కేసుల బారిన పడవద్దని సూచించారు. మహిళల కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవాలన్నారు. ఆకతాయిలు ఎవరైనా మహిళలను, బాలికలను వేధిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీపీ రాంబాబు, న్యాయవాదులు మహేష్, బండారి శ్రీనివాస్, రాజేష్, వినోద్, ఏఎస్ఐ హబీబ్, ఎస్‌వో ఫణిబాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

బెల్లంపల్లి, జూలై20 (ఆంధ్రజ్యోతి): తిలక్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు సంతృప్తిని ఇస్తున్నాయని తిలక్‌వాకర్స్ అసోసి యేషన్ సభ్యులు రత్నం రాజన్న, రంగ రామన్నలు అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భవన నిర్మాణ కార్మికులకు, నిరుపేదలకు అల్పాహారం పంపిణీ చేసి మాట్లాడారు. గత కొన్నేళ్లుగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులందరం వివిధ సేవాకార్య క్రమాలు చేపడుతున్నామన్నారు. సేవా సంస్థకు అన్ని వర్గాల నుంచి తోడ్పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నగేశ్ కుమార్, గెల్లి జయరాం యాదవ్, సుకుమార్‌లు పాల్గొన్నారు.